11.30 గంటలైనా తెరచుకోని హౌసింగ్ కార్యాలయం

లబ్ధిదారుల ఇబ్బందులు

తలుపులు తెరుచుకోని హౌసింగ్ కార్యాలయం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉయదం 11:30 గంటలైనా ఉరవకొండ హౌసింగ్ కార్యాలయం తెరవకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 10 గంటలలోపు తెరచుకుంటాయి. అయితే మంగళవారం ఉరవకొండలో హౌసింగ్ డిఇ ఎఇ కార్యాలయం 11.30 గంటలైనా తెరచకపోవడంతో నియోజకవర్గంలోని వజ్రకరూరు, విడపనకల్, ఉరవకొండ తదితర మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మండలాలలో సకాలంలో ప్రభుత్వ కార్యాలయాలు తెరచుకునేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

బటన్ నొక్కడం కాదు రైతుల సమస్యలు పరిష్కరించండి

పంట నష్ట పరిహారం మంజూరులో అక్రమాలపై విచారణ చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ప్రజాశక్తి ఉరవకొండ

బటన్లు నొక్కడం ద్వారా రైతులకు ప్రయోజనం లేదని వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతుల సమస్యలు పరిష్కరించాలని, పంటనష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.35వేలు పరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉరవకొండలోని సిపిఎం కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా ప్రతి సంవత్సరం దాదాపు 9.18 లక్షల ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు చేసే వారన్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 50,669 ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు చేశారన్నారు. ప్రతి సంవత్సరం జిల్లాలో 7 లక్షల ఎకరాలలో వేరుశనగ పంట సాగు చేసేవారని ఇప్పుడు అధికారుల లెక్కల ప్రకారం కేవలం 19 వేల ఎకరాలలో మాత్రమే వేరుశనగ పంటను సాగు చేశారని చెప్పారు. వర్షాలు రానప్పుడు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని అవకాశం ఉన్నచోట కృత్రిమ వర్షాలు కురిపించే విధంగా చర్యలు చేపట్టకుండా కాలయాపన చేయడం తగదన్నారు. పాలకులు రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. జిల్లాలో ఉన్న 31 మండలాల్లో 18 మండలాలలో ఇప్పటివరకు సరైన వర్షాలు లేక విత్తనసాగు చేపట్టలేదని అధికారులే లెక్కలు చెబుతున్నారన్నారు. దీన్నిబట్టి చూస్తే కనీసం 60 శాతం పైబడి జిల్లాలో వ్యవసాయ పనులు లేక రైతులు తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి నెలకొందన్నారు. వర్షాలు రానప్పుడు గతంలో ప్రభుత్వాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని మేఘ మధనం కార్యక్రమాల ద్వారా వర్షాలు కురిపించే వారన్నారు.ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అలాంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లోని అధికార,ప్రతిపక్ష పార్టీ నాయకులకు ఒకరి మీద ఒకరు బురదజల్లే ఆరోపణలు చేసుకోవడానికి సమయం సరిపోయిందన్నారు. రెండు సంవత్సరాల క్రితం భారీ వర్షాలు కురిసినప్పుడు దాదాపు 350 టిఎంసిల వర్షపునీరు పాలకుల నిర్లక్ష్యంతో వృధాగా సముద్రాల్లో కలిసిపోయాయన్నారు. పాలకులు అప్రమత్తమై రిజర్వాయర్లలో హంద్రీనీవా పిల్ల కాలవల ద్వారా పెనకచెల్ల రిజర్వాయర్‌లో వర్షపు నీరు నిలువ చేసేందుకు ప్రయత్నించినట్లయితే కనీసం 50 టీఎంసీల వర్షపు నీరు నిలువ ఉండేదన్నారు. తద్వారా రైతులకు కొంత మేరకు ఉపశమనం కలిగేదన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో వేల ఎకరాలలో పంటలు సాగు చేసే రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో తీవ్రంగా నష్టపోయారన్నారు. ఉరవకొండ నియోజకవర్గ అధికార ప్రతిపక్ష పార్టీ నాయకులు వ్యక్తిగత దూషణలు, పరస్పర ఆరోపణలకు పరిమితమయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా వారి స్వప్రయోజనాలు మానుకొని నియోజకవర్గ ప్రజలు రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలని హితవు పలికారు. రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్యానికి గత రెండు నెలలు కాలంలో ఆత్మహత్యలు ఎక్కువ అవుతున్నాయని అన్నారు. సత్యసాయి జిల్లాలో మహిళా రైతు ఆత్మహత్య చేసుకుంటూ సూసైడ్ నోట్ రాసిందని గుర్తు చేశారు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంటలబీమాలో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని విమర్శించారు. పంటల బీమా పంపిణీలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టకపోతే సిపిఎం ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రాలలో జూలై చివర్లో పాదయాత్రలు చేపట్టి జిల్లా కేంద్రంలో ఆగస్టు 15 తర్వాత ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, రైతు సంఘం నాయకులు సీనప్ప, రామాంజనేయులు నాయక్, సిద్ధప్ప, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఆశా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశావర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయం మంగళవారం ధర్నా నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్యాలయం నుంచి డిఎంహెచ్ఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం వద్ద బైటాయించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలకు పని భారాన్ని తగ్గించాలన్నారు. వేతనాలు పెంపుదల చేయాలన్నారు. జాబ్‌చార్ట్ ప్రకారమే పనులు చేయించాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఆశాలతో ఎక్కువగా పనులు చేయిస్తున్నారన్నారు. మాతా శిశుసంరక్షణ, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆశాలు కీలకంగా పని చేస్తున్నారని తెలిపారు. ఆవులదట్ల శ్రీరంగపురం పిహెచ్‌సిలో క్లీనింగ్ పనులు కూడా చేయిస్తున్నారని ఇది సరికాదని అన్నారు. వెంటనే అక్కడి అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన ఫోన్‌లు ఇవ్వాలని, మెడికల్ లీవులు, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిం చాలని కోరారు. ఆందోళన కారుల వద్దకు వచ్చిన డిఎంహెచ్ఒ గంగాధర్ మాట్లాడుతూ ఆశాలు జాబ్‌చార్ట్ ప్రకారం ఏ పనులు చేయాలో అవే చేయాలని, ఇతర పనులు ఏవీ చేయొద్దని చెప్పారు. ఈ విషయంపై అన్ని పిహెచ్‌సిలకు ఉత్తర్వులు పంపుతామన్నారు. వేతనాల పెంపు, ఇన్సూరెన్స్, మెడికల్ లీవులు ఇవన్నీ తమ పరిధిలో లేవని, పై అధికారుల దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఆశాల ధర్నాకు ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా హాజరై మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా నాయకులు సుజాత, పద్మావతి, భారతి, మాలతి, మల్లికతో పాటు అధికసంఖ్యలో ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెగా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్, తదితరులు

'జగనన్న తోడు'ను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ ఎమ్.గౌతమి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వీధి వ్యాపారాలకు జగనన్న తోడు పథకం ఎంతో భరోసాను కల్పిస్తోందని, అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎమ్.గౌతమి పేర్కొన్నారు. మంగళవారం విజయవాడ నుంచి ముఖ్యమంత్రి నిర్వహించిన జగనన్న తోడు పథకం పంపిణీ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ మంజుల, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, పలువురు లబ్ధిదారులు, చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని చిరు వ్యాపారాలు, సాంప్రదాయ వృత్తుల వారికి జగనన్న తోడు పథకం భరోసా, విశ్వాసాన్ని కలిగిస్తోందని తెలిపారు. ప్రభుత్వం చిరు వ్యాపారులకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ధ్యేయమని అన్నారు. అధిక వడ్డీలు కట్టలేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్న పేదవారి జీవితాల్లో మార్పు తీసుకురావాలనే దృఢ సంకల్పంతో వడ్డీ లేని రుణ సదుపాయంతో ప్రభుత్వం జగనన్న తోడు పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు కూడా ఈ డబ్బును సద్వినియోగం సూచించారు. జిల్లాలో జగనన్న తోడు ఏడవ విడత కింద 24,132 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ. 25, 98, 90, 000 బ్యాంకు రుణాన్ని వారి ఖాతాల్లోకి జమ చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా గతంలో రుణం పొంది సకాలంలో చెల్లించిన 29,150 మందికి సున్నా వడ్డీ కింద రూ.63.06 లక్షలు వారి ఖాతాల్లోకి నేరుగా జమ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన రుణం, సున్నా వడ్డీ మొత్తానికి సంబంధించి రూ . 26,61,96,000ల విలువైన మెగా చెక్కును విడుదల చేశారు.

ఆ ఇద్దరు పిసిసిలు ఎటువైపు..?

రఘువీరా రెడ్డి మౌనం
టిడిపి వైపు శైలూ చూపు..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమవుతోంది. ఈ సమయంలో నేతలు ఎవరు ఎటు ఉంటారోనన్న చర్చలు సర్వత్రా సాగుతూనే ఉంటాయి. ఇదే కోవలో ఇద్దరు మాజీ పిసిసి అధ్యక్షుల పట్ల కూడా జిల్లాలో చర్చ సాగుతుండటం గమనార్హం. జిల్లాలో సీనియర్ నాయకుల్లో మాజీ పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డిరు ఒకరు. ముందు నుంచి కాంగ్రెసు పార్టీలో ఉంటూ అనేక పదవులను అలంకరించి జిల్లాపై ఒక చెరగని ముద్రను వేశారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల మంత్రిగానూ పనిచేశారు. రాష్ట్ర విభజన తరువాత కాంగ్రెసు పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిగా దెబ్బతింది. ఈ తరుణంలో ఆయన పిసిసి అధ్యక్ష బాధ్యతలను తీసుకుని పూర్వ వైభవాన్ని ఇక్కడికి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే ఆశించిన ఫలితాలు మాత్రం రాలేదు. 2014, 2019 ఎన్నికల్లోనూ ఉమ్మడి జిల్లాలో పెనుకొండ, కళ్యాణదుర్గంలోనూ ఆయన పోటీ చేసినప్పటికీ కాంగ్రెసుపై ఉన్న వ్యతిరేకతతో ఓటమిని చవిచూడక తప్పలేదు. 2019 ఎన్నికల తరువాత నుంచి పిసిసి పదవి నుంచి కూడా తప్పుకుని రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు. అయితే ఇటీవల జరిగిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కాంగ్రెసు పార్టీ తరపున అక్కడ ప్రచారం చేశారు. తిరిగి ఆయన యాక్టివ్ అయ్యారని భావించారు. కాని ఇప్పటికీ రాష్ట్ర రాజకీయాల పట్ల మాత్రం మౌనంగానే ఉంటూ వస్తున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోపు అయినా ఇక్కడి రాజకీయాల వైపు దృష్టి సారిస్తారా లేక దూరంగానే ఉంటారా అన్న చర్చ ఉమ్మడి జిల్లా వాసుల్లో చర్చ నడుస్తూ ఉంది. ఇక రఘువీరారెడ్డి పిసిసి అధ్యక్షతల నుంచి తప్పుకున్న తరువాత మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. ఆయన 2004లో వైద్యవృత్తిని వదిలి రాజకీయరంగ ప్రవేశం చేశారు. 2012లో కాంగ్రెసు పార్టీ హయంలోనే విద్యా శాఖ మంత్రి అయ్యారు. రఘువీరారెడ్డి పిసిసి అధ్యక్ష పదవి నుంచి తప్పుకున్నాక ఆయన పిసిసి అధ్యక్షులయ్యారు. మొన్నటి వరకు ఆయన పిసిసి అధ్యక్షులుగా ఉంటూ వచ్చారు. కాని ఇటీవల ఆయన స్థానంలో గిడుగు రుద్రరాజును నియమించారు. అప్పటి నుంచి ఆయన కొంత వరకు కాంగ్రెసుకు దూరంగా జరుగుతున్నారన్న ప్రచారం రాజకీయవర్గాల్లో నడుస్తోంది. ఇక రాష్ట్రంలో కాంగ్రెసు ఇప్పట్లో పుంజుకునే పరిస్థితి లేదన్న ఉద్దేశ్యంతో ఇతర పార్టీల వైపు దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఈ మేరకు ఆయన పూర్వపు నియోజకవర్గమైన శింగనమలలో ఇటీవలి కాలంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ముందున్న పరిచయాలతో ముఖ్యమైన వారిని గ్రామాల వారీగా కలుస్తూ, వచ్చే ఎన్నికల్లో తనకు సహకారం అందివ్వాలని కోరుతున్నారు. అయితే ఏ పార్టీ తరపున అన్నది స్పష్టంగా వారికి మాత్రం చెప్పడం లేదు. అయితే ఆయన తెలుగుదేశం పార్టీలోకి త్వరలో చేరే అవకాశముందన్నది మాత్రం ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ మేరకు ఇటీవల కాలంలో ఆయన ఆ పార్టీ ముఖ్య నేతలతో మంతనాలు జరిపారన్న ప్రచారమూ ఉంది. ఇప్పటికే తెలుగుదేశం పార్టీలో ఆ నియోజకవర్గంలో గ్రూపు తగాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటిని చెక్ పెట్టేందుకు ఆయన్ను తీసుకొస్తే బాగుంటుందన్న ఆలోచనలోనూ తెలుగుదేశం పార్టీ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ పిసిసి అధ్యక్షులు డాక్టర్ శైలజనాథ్ తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది. అయితే రఘువీరారెడ్డి ఎటు అన్నదే ఇప్పటికీ స్పష్టత లేదన్నది రాజకీయవర్గాల్లో సాగుతున్న చర్చ.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఎస్ఎఫ్ఐ నాయకులు వరుణ్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ఇంటర్ బోర్డు కార్యాలయం వద్ద బుధవారం ధర్నాకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ ధర్నాలో పాల్గొనేందుకు తాడిపత్రి నుంచి విజయవాడకు రైలులో వెళ్లేందుకు ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు రైల్వేస్టేషన్‌కు చేరుకుని విద్యార్థులతోపాటు ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం పోలీసులను అడ్డు పెట్టుకుని ఉద్యమాలను అణచివేయాలని చూడటం మర్ఖత్వానికి నిదర్శనమన్నారు. ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వలేని ప్రభుత్వం ఇలా అక్రమ అరెస్టు, కేసులతో ఉద్యమాలను ఆపలేరని తెలిపారు. అరెస్టు అయిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వరుణ్, నాయకులు,ఇంటర్ విద్యార్థులు ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

కార్యకర్తల అండతోనే ఈస్థాయికి..

మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

కార్యకర్తలు, అభిమానుల అండదండ్రలతోనే ఈస్థాయిలో ఉన్నానని మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తాడిపత్రిలోని జెసి నివాసం వద్ద మంగళవారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు, అభిమానుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని టిడిపి కార్యకర్తలు, అభిమానులు ఓటరు వెరిఫికేషన్‌పై అవగాహనతో ఉండాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో టిడిపి అండతోనే ఈస్థాయిలో ఉన్నాన్నారు. కార్యకర్తల అండ లేకపోతే తనకు మూడే మార్గాలన్నారు. ఒకటి ఆత్మహత్య చేసుకోవడం, రెండోది ఊరు విడిచి పారిపోవడం, మూడోది ఎమ్మెల్యేకు కప్పం కట్టడం అని అన్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాను ఇంట్లో లేనప్పుడు ఇంటికొచ్చాడని, ఈ ఘటనను మరిచిపోలేదన్నారు. సీఐ ఆనందరావు ఆత్మహత్యపై కోర్టులో కేసు వేయనున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టులో కేసు వేయడంతోనే ఇసుక రీచ్‌లు రద్దయ్యాయన్నారు. కంటెంట్ ఆఫ్ కోర్టు కింద కలెక్టర్‌తోపాటు మరికొందరు అధికారులకు నోటీసులు అందాయన్నారు. అందరి అభిమానులతో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటానన్నారు.

కామ్రేడ్ వీరన్న బాటలో పయనిద్దాం

వర్ధంతి సభలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

కిష్టపాడులోని స్థూపం వద్ద కామ్రేడ్ వీరన్న కు నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

కామ్రేడ్ వీరన్న చూపిన ఉద్యమ బాటలో పయనిద్దామని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. వీరన్న వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని కిష్టిపాడు గ్రామంలో ఉన్న స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి.వీరన్న నిరుపేద దళిత కుటుంబంలో పుట్టి డిగ్రీ వరకూ చదివి పీడితజనుల కోసం పని చేయాలని భావించి 1996లో సిపిఎం సాధారణ కార్యకర్తగా చేరారన్నారు. అప్పటి నుంచి డివైఎఫ్ఎస్ఐ జిల్లా కన్వీనర్‌గా ఉద్యమాన్ని ప్రారంభించి కార్మిక నాయకునిగా, శింగనమల మండల కార్యదర్శిగా, 1998లో ఏర్పడిన కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులుగా, జిల్లా కార్యదర్శిగా దాదాపు 22 సంవత్సరాలు ప్రజా పోరాటాలకు అంకితమై పనిచేశారు. అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ముఖ్యంగా దళిత సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు చేశారన్నారు. నిదనవాడ, దళితుల భూసమస్య, క్రిష్టిపాడులో వివక్షతకు వ్యతిరేకంగా నిలబడిన వ్యక్తిని వీరన్న అన్నారు. కెవిపిఎస్ లక్ష్యాలైన ఆత్మగౌరవం, సమానత్వం, కులనిర్మూలన సాధన కోసం కృషి చేశారన్నారు. పాదయాత్రలు, సైకిల్ యాత్రలు, జీపుయాత్రలకు నాయకత్వం వహించారన్నారు. జులై, ఆగస్టు నెలల్లో నిర్వహించనున్న దళిత రక్షణ యాత్ర ద్వారా దళితులను చైతన్యం చేయనున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం దేశంలో మతోన్మాద పార్టీ అధికారంలో ఉండి రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తోందన్నారు. ఫలితంగా దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. ప్రభుత్వ రంగాన్ని నాశనం చేస్తోందన్నారు. రిజర్వేషన్లకు ప్రమాదం పొంచిఉందన్నారు. వీరన్న ఆశయం నెరవేరాలంటే వినాశకరమైన విధానాలపై సమరశీల పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కెవిపిఎస్, ఐద్వా జిల్లా నాయకురాలు జి.అరుణమ్మ, సిపిఎం మండల కార్యదర్శి మద్దిలేటి, వీరన్న కుటుంబ సభ్యులు, వీరన్న భార్య ఐద్వా నాయకురాలు కెవిపిఎస్ నాయకురాలు అరుణకుమారి, వీరన్న తల్లి పెద్దక్క, ఐద్వా మహిళా కార్యదర్శి రేవతి, కుమారుడు సూర్యప్రకాష్, కూతురు ప్రత్యూష, వీరన్న తమ్ముళ్లు పెద్దశ్రీరాములు, గోపాల్, రామాంజినేయులు, కార్యకర్తలు లక్ష్మీదేవి, సుజాత, ఈశ్వరమ్మ, వెన్నెల, సుస్మిత, అరుణ, బేబీ, హుసేనమ్మ, సుమతి, వీరకుమార్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో వీరన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

అనంతపురం కలెక్టరేట్ : కెవిపిఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు కామ్రేడ్ జి.వీరన్న ఆశయాలు కొనసాగించేందుకు కృషి చేద్దామని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అన్నారు. వీరన్న వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ అధ్యక్షతన వీరన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కెవిపిఎస్ నిర్వహించిన భూ పోరాటాలు, కుల నిర్మూలన, వివక్షతను వ్యతిరేకిస్తూ చేసిన పోరాటాల్లో వీరన్న తనదైన పాత్ర పోషించాడని గుర్తు చేశారు. పేదల పక్షాన అనేక ఉద్యమాలు చేశారన్నారు. అంతేగాకుండా పేదరిక నిర్మూలన, సమానత్వం సాధికారత కోసం పని చేశారన్నారు. ఆయన ఆశయాలు నెరవేర్చేందుకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు రాజా, మల్లెల ఎర్రిస్వామి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజనమ్మ, ప్రజానాట్య మండలి జిల్లా ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి, లక్ష్మీనారాయణ, పుల్లన్న, నాగేంద్ర, నాగభూషణ, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండల పరిధిలోని గడేకల్ గ్రామం ప్రభుత్వ హైస్కూల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు బదిలీ కావడంతో పాఠశాల సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పిటిసి హనుమంతు మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమన్నారు. గడేకల్ గ్రామంలో ఉపాధ్యాయులుగా పనిచేసిన కాలమంతా విద్యార్థుల విద్యాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేసి ఉత్తమ ఫలితాలు సాధించారని కొనియాడారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు ఆంజనేయులు, కృష్ణాసింగ్, ఉదయభాను, పాతిమాను శాలువా కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కరణం భీమిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శభాష్.. భారతి

ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

కూలి పని చేసుకుంటూ డాక్టరేట్ పొందిన మహిళకు సన్మానం

ప్రజాశక్తి-శింగనమల

'శభాష్ భారతి.. చదువుకు పేదరికం అడ్డుకాదు' అని నిరూపించావ్.. అంటూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అభినందించారు. సోమవారం ఎస్‌కెయులో నిర్వహించిన స్నాతకోత్సవంలో సాకే భారతి కూలీ నాలి చేసుకుంటూ చదువుకుని రసాయన శాస్త్రంలో పిహెచ్‌డి పట్టా తీసుకున్న విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఐద్వా నాయకురాళ్లు గ్రామానికి చేరుకుని భారతిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వి.సావిత్రి మాట్లాడుతూ పేదరికాన్ని జయించి తన ఉన్నత ఆశయం విద్య ఒక్కటే అన్న తపనతో చదువుకుని ఉన్నత విద్య పిహెచ్‌డిని పూర్తి చేయడం సంతోషకరమన్నారు. ఆర్థిక స్తోమత లేకపోయినా తన ఆశయాన్ని ఆపకుండా ఇష్టపడి, కష్టపడి చదివి మహిళలు గర్వించేలా చేసిన భారతిని అభినందించాల్సిన అవసరం ఎంతైనా

భారతిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

పిహెచ్‌డి పట్టా పొందిన భారతిని సన్మానిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

ఉందన్నారు. ఇలాంటి ప్రతిభ ఉన్న మహిళలకు ప్రభుత్వాలు ప్రోత్సహించి విజ్ఞానాన్ని సమాజానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలు రామాంజనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అలాగే మాజీమంత్రి కాలవ శ్రీనివాసులుతోపాటు టిడిపి నాయకులు భారతి నాగులగుడ్డం గ్రామానికి చేరుకుని భారతిని సన్మానించడంతోపాటు రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి, పెరిగి పేదరికం అడ్డు కాదని నిరూపించిన భారతిని ప్రతి ఒక్క మహిళా ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసి అంజినమ్మ, సి.వెంకటేష్, దాసరి గంగాధర్, మాజీ ఎంపిటిసి కుళ్లాయప్ప, బండి బాలరాజు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎం.ఆదినారాయణ, బిసి సెల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, ప్రసాద్‌నాయక్, రంగస్వామి, దండు ప్రకాష్, దాసరి రామాంజనేయులు, తలారి తిప్పన్న, శింగనమల గ్రామ కమిటీ అధ్యక్షులు బండి వెంకట నారాయణ, దాసరి రాధ, దాసరి వెంకటరమణ, ఆది, విజయ్, మల్లిఖార్జున, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వైసిపి నాయకుడు మృతి

బాలకృష్ణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులు

నార్పల : మండల కేంద్రంలోని మాజీ మండలాధ్యక్షుడు ఎర్నాగప్ప కుమారుడు, 4వ ఎంపిటిసి భాగ్యలక్ష్మి భర్త, వైసిపి యువ నాయకుడు బాలనాగి బాలకృష్ణ విద్యుదాఘాతంతో మృతిచెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు... బాలకృష్ణ తన వ్యవసాయ తోటలో పంటకు మందు కొట్టేందుకు ఉదయాన్నే భార్యాపిల్లలతో కలిసి వెళ్లాడు. ఈనేపథ్యంలో తోట పక్కనే కంచెకు విద్యుత్ సరఫరా అవుతుండడంతో బాలకృష్ణ కుమారుడు పొరపాటున పట్టుకోవడంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే బాలకృష్ణ భార్య, తల్లి విద్యుదాఘాతానికి గురైన బాలుడిని కాపాడడానికి వెళ్లి వీరూ విద్యుదాఘాతానికి గురయ్యారు. పక్కనే పనిచేస్తున్న బాలకృష్ణ గమనించి తన ఒంటిపైన ఉన్న లుంగీ తీసి కాపాడే క్రమంలో పొరపాటు విద్యుత్ తీగ బాలకృష్ణ శరీరంపై పడడంతో షాక్‌కు గురై సృహకోల్పోయాడు. వెంటనే బంధువులు, స్థానికులు 108 ద్వారా అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలకృష్ణ మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, నాయకుడు సత్యనారాయణరెడ్డి, జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహాతోపాటు పలువురు ఆసుపత్రికి చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. తర్వాత ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

యాడికి : మండలంలోని భోగాలకట్ట గ్రామానికి చెందిన రైతు రాధాకృష్ణారెడ్డి మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పై కప్పునకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ అంబటి గురుప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబ కలహాలతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పునకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమణించిన స్థానికులు వెళ్లి రక్షించే లోపు విగతజీవిగా మారినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

మృతిచెందిన గొర్రె పిల్లలు

గార్లదిన్నె : మండల పరిధిలోని జమ్ములదిన్నె గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం గొట్కూరు రామాంజనేయులుకు చెందిన 35 గొర్రె పిల్లలపై వీధి కుక్కలు దాడి చేసి చంపాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గొర్రె పిల్లలను గూట్లో వేసి వెళ్లగా గ్రామంలోని వీధి కుక్కలు గూడు దబ్బలను కొరికి పిల్లలను చంపినట్లు వాపోయాడు. దీంతో సుమారు రూ.1.70లక్షల నష్టం వాటిల్లినట్లు ఆందోళన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రేషన్‌బియ్యం పట్టివేత

పట్టుబడిన బియ్యాన్ని చూపుతున్న అధికారులు

గుత్తి : మండలంలోని ఎంగిలిబండ గ్రామ మలుపు వద్ద 67వ జాతీయ రహదారిపై మంగళవారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. పౌరసరఫరాల శాఖ ఉప తహశీల్దార్ (సిఎస్ డిటి) ఎంకె.సూర్యనారాయణ, విజిలెన్స్ అండ్ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వి.వెంకటరమణ, ఎస్.యామినీ సరస్వతి తెలిపిన వివరాల మేరకు బొలేరో వాహనంలో 23.5 క్వింటాళ్ల బియ్యాన్ని యాడికి నుంచి గుత్తి మండలంలోని కరిడికొండకు తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వాహనం డ్రైవర్ కరిడికొండకు చెందిన శంకర్‌ను అరెస్టు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడుపై 6ఎ కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రయివేటు బస్సు సీజ్

రాయదుర్గం : పర్మిట్ మేరకు బస్ సర్వీసు తిరగనందున కణేకల్–బళ్లారి మధ్య తిరుగుతున్న ఎస్ఆర్‌జె బస్సును సీజ్ చేసినట్లు రాయదుర్గం రవాణా శాఖ మోటార్ వాహనాల తనిఖీ అధికారి విశ్వనాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిటిపి గ్రామ ప్రజల ఫిర్యాదు మేరకు వాహనాన్ని తనిఖీ చేయగా పర్మిట్ మేరకు తిరగనందన బస్సును సీజ్ చేసి కనేకల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఎంవిఐ తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతోపాటు ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిఆర్‌ఓ గాయత్రిదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేయాలన్నారు. జూనియర్, డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులు భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈ.కుళ్లాయిస్వామి, జి.చిరంజీవి, జిల్లా ఆఫీస్ బేరర్స్ హనుమంతు, రమణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకట్‌నాయక్, ఆంజనేయులు, నరసింహ యాదవ్, ఉమా మహేష్, వేణు, వినోద్, వంశీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థినీ, విద్యార్థులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు ఎటిఎం నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతు కార్మికులు ఆరురోజులుగా నిరాహార దీక్షలు చేపట్టినా పాలకవర్గం, అధికార వర్గాల్లో చలనం లేకపోవడం దారుణమని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం, సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలేదీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల పిఎఫ్ సమస్య పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో ఎంఎస్.7 ప్రకారం వేతనాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఆరురోజులుగా మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు రాత్రనకా.. పగలనకా నగర ప్రజలకు సకాలంలో సేవలు చేస్తున్నారన్నారు. మున్సిపల్ కార్మికుల వేతనంలో కటింగ్ అయిన పిఎఫ్ సమస్యను 12 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్‌లో పనిచేస్తున్న అన్నివిభాగాల కార్మికులు, నాయకులు పాల్గొన్నారు

ఆందోళనలో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు ఎటిఎం నాగరాజు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

జెఎన్‌టియు ఉపకులపతి జి.రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులు సాంకేతిక విద్యతోపాటు క్రీడల్లో రాణించేలా కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు కృషి చేయాలని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన సూచించారు. బుధవారం స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఇఇఇ సెమినార్ హాలులో స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి.జోజిరెడ్డి అధ్యక్షతన జెఎన్‌టియు అనుబంధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ల 14వ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యతోపాటు క్రీడలు, యోగాలో విద్యార్థులు ప్రతిభ కనబరచాలన్నారు. అందుకు ప్రతి కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కృషి చేయాలని సూచించారు. జెఎన్‌టియు పరిధిలోని ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలు, అటానమస్ కళాశాలల్లో తప్పనిసరిగా వ్యాయామ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుడు ఉండే విధంగా చర్యలు తీసుకుంటునట్లు వివరించారు. క్రీడలు సిలబస్‌లో కూడా ఒక భాగంగా చేర్చాలన్నారు. రెక్టార్ ఎం.విజయకుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పరిధిలో ఎంతో మంది క్రీడాకారులను తయారు చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లను ప్రశంసిస్తూ అందుకు కృషి చేస్తున్న స్పోర్ట్స్ కౌన్సిల్ విభాగాన్ని అభినందించారు. రిజిస్ట్రార్ సి.శశిధర్ మాట్లాడుతూ జెఎన్‌టియులోని ఫిజికల్ డైరెక్టర్లకు ప్రతి కళాశాలలో ఫిజికల్ కార్యకలాపాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. అందుకు ఫిజికల్ డైరెక్టర్ల కృషి చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి.జోజిరెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, వర్సిటీ పిఆర్‌ఒ ఎం.రామశేఖరరెడ్డి, 80 మంది వ్యాయామ అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు ఉపకులపతి జి.రంగజనార్ధన

ముగిసిన ఆర్డీటీ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-తాడిపత్రి

పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఆర్డీటీ క్యాంపు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. వారం రోజులుగా సాగిన ఈ పోటీల్లో పద్మవాణి, శ్రీవాణి పాఠశాలలకు చెందిన అమ్మాయిలు, అబ్బాయిల జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. దీంతో ఉదయం సాగిన హోరాహోరీ పోరులో పద్మవాణికి చెందిన అమ్మాయిల జట్టు విజయం సాధించింది. అనంతరం జరిగిన అబ్బాయిల పోటీలో పద్మవాణి అబ్బాయిల జట్టునే విజయం వరించింది. అమ్మాయిల జట్టులో బెస్టు బ్యాట్స్ ఉమెన్‌గా లక్ష్మీప్రసన్న, బెస్ట్ బౌలర్‌గా హిమాన్యుల్, బెస్ట్ వికెట్ కీపర్‌గా తేజశ్రీ, బెస్ట్ ఆల్‌రౌండర్‌గా తేజశ్రీ అవార్డులు అందుకున్నారు. అలాగే అబ్బాయిల జట్టులో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా యశ్వంత్, బెస్ట్ బౌలర్‌గా భాను శ్రవంత్, బెస్ట్ వికెట్ కీపర్‌గా యశ్వంత్, ఆల్‌రౌండర్‌గా యశ్వంత్ అవార్డులు సాధించారు. విజేతలకు స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి, అనంతపురం క్రికెట్ కోచ్ యుగంధర్‌రెడ్డి, ఫైర్ సీఎం మోహన్‌బాబు, ఎటిఎల్ రామాంజనేయులు, సీనియర్ కోచ్ సాదిక్‌వలి, ఆర్‌డిటి క్రికెట్ కోచ్ భార్గవ్, తదితరులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మవాణి పాఠశాల కరస్పాండెంట్ నాగపీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ బౌలర్ అవార్డు అందుకుంటున్న భానుశ్రవంత్‌రెడ్డి

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి సన్మానం

ప్రజాశక్తి-శింగనమల

స్త్రీ శిశుసంక్షేమ సంఘం జాయింట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని మంగళవారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో సిడిపిఒ ఉమాశంకరమ్మ, ఐసిడిఎస్ ప్రాజెక్టు, ఐసిడిఎస్ యూనియన్ లీడర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిడిపిఒ శింగనమల ఐసిడిఎస్ ప్రాజెక్టు మూడు మండలాల్లోని అంగన్‌వాడీలు, మినీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ఆయా సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు యూనియన్ లీడర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిని సన్మానిస్తున్న ఐసిడిఎస్ అధికారులు

ప్రత్యామ్నాయ సాగుకు సిద్ధం కండి

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు ప్రత్యామ్నాయ సాగుకు సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నిర్మాణాలు పూర్తయిన రైతు భరోసా కేంద్రాలను వ్యవసాయ అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకూ 248 భవనాలు పూర్తి కాగా 162 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన వాటిని వాడకంలోకి తీసుకురావాలన్నారు. ఈ పంట నమోదుపై డివిజన్, మండల, రైతు భరోసా కేంద్రం, వ్యవసాయ, ఉద్యానవన, సెరికల్చర్, రెవెన్యూ అధికారులకు శిక్షణ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇకపోతే జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ విత్తనాలకు సంబంధించి వివరాలను వ్యవసాయ కమిషనర్ కార్యాలయం పంపించాలన్నారు. ముఖ్యంగా చిరుధాన్యాల సాగుకు రైతులు మందుకు వచ్చేందుకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రాకుండా వ్యవసాయ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. తరచూ దుకాణాలను తనిఖీ చేసి శాంపిల్స్‌ను పంపించాలన్నారు. కౌలుదారు రైతులను గుర్తించి కార్డులు ఇప్పించాలన్నారు. ఇప్పటి వరకూ జిల్లాలో 6,514 కౌలు రైతుల గుర్తింపు కార్డులు లక్ష్యంకాగా 5212 మందికి కౌలు గుర్తింపు కార్డులు పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి బి.రఘునాథ్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుబ్రమణ్యం, సూక్ష్మ నీటిపారుదల శాఖ అధికారి పి.ఫిరోజ్‌ఖాన్, జిల్లా అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం అభినందనీయం

బాధితులకు నగదు అందజేస్తున్న మేయర్

అనంతపురం కార్పొరేషన్ : ఆపదలో ఉన్న వారిని దాతలు ముందుకొచ్చి ఆదుకోవడం అభినందనీయమని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. మంగళవారం స్థానిక మేయర్ వసీం క్యాంపు కార్యాలయంలో నోబుల్ హెల్పింగ్ హాండ్స్ అందజేసిన రూ.99 వేలను మున్నానగర్‌కు చెందిన షేక్ మామ జిగినికి, కుటుంబ సభ్యులకు అందజేశారు. మున్నా నగర్ కు చెందిన ఆటో డ్రైవర్ దాదాపీర్ తన కూతురు షేక్‌మామా జిగినికి ఫ్యాన్కో అనీమియాతో బాధపడుతోంది. దీంతో సుమారు రూ.20 లక్షల వరకూ ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. ఆర్డీటీ ద్వారా ఇప్పటికే రూ.5లక్షలు, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షలు ఇచ్చారు. ఇంకా అవసరమైన వైద్య ఖర్చులకు దాతలు ముందుకొచ్చి సాయం అందజేయడం చాలా సంతోషమన్నారు. దాతలు ఎవరైనా సహాయం చేయాలనుకుంటే దాదాపీర్ ఫోన్‌పే నెంబర్ సెల్..99087 08236 చేయాలని కోరారు.

బీ.ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బి.ఫార్మసీ 1వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్19) రెగ్యులర్, ఫార్మా–డి 4వ, 5వ సంవత్సరా (ఆర్17) అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, ఫార్మా–డి 3వ సంవత్సరం (ఆర్17) సప్లిమెంటరీ, ప్రీ–పిహెచ్‌డి సమ్మర్ సెషన్ (2021 అడ్మిషన్లు పొందిన) ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ. కేశవరెడ్డి, కంట్రోలర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్ష పలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని తెలిపారు.

జిల్లాకు 1433 మెట్రిక్ టన్నుల యూరియా రాక

అనంతపురం : జిల్లాకు 1433.880 మెట్రిక్ టన్నుల ఎం.ఎఫ్.సి.ఎల్ కంపెనీకి చెందిన యూరియా బుధవారం చేరుకున్నట్లు అనంతపురం ఎడిఎ ఎం.రవి తెలిపారు. ఈమేరకు ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌కు వచ్చిన ఎరువులను పరిశీలించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి సూచనల మేరకు మార్కుఫెడ్, ప్రయివేట్ డీలర్లు, సొసైటీలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు మండల వ్యవసాయ అధికారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల రికార్డులను చూపుతున్న ఎడిఎ రవి

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-శెట్టూరు

మండల కేంద్రంలో మంగళవారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) సభ్యత్వ నమోదు చేపట్టినట్లు మండల అధ్యక్షులు ఈరన్న, ప్రధాన కార్యదర్శి మారెప్ప, కోశాధికారి వెంకటేష్ తెలిపారు. మండలంలోని పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అబ్దుల్‌వహాబ్, సీనియర్ నాయకులు తిప్పేస్వామి, రవిశంకర్, తిమ్మరాయుడు, నరసింహులు, చంద్రబాబు, కోదండపాణి, శ్రీనివాసులు, నరసింహులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ సభ్యత్వం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

నేడు కంటి వైద్యశిబిరం

బ్రహ్మసముద్రం : వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు వైద్యాధికారి రాజేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారు ఆధార్ కార్డు తీసుకుని బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఆసుపత్రికి చేరుకోవాలని కోరారు.

కామ్రేడ్ వీకే ఆదినారాయణరెడ్డికి నివాళి

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు వీకే ఆదినారాయణరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని పూర్వపు కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని పెద్దాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ముందుగా వీకే ఆదినారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీకే ఆదినారాయణరెడ్డితో ఉన్న అనుబంధాన్ని వారు గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలకు తాగు, సాగునీటి సాధన కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వీకే రంగారెడ్డి, తోటపల్లి నారాయణరెడ్డి, వై.మధుసూదన్‌రెడ్డి, మొగలి సత్యనారాయణరెడ్డి, రామచంద్రారెడ్డి, విశ్రాంతి డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, ఎల్ఐసి తిరుపతయ్య, తలారి రామాంజనేయులు, పతకమూరు నాగరాజు, రేపటి రామాంజనేయులు, ప్రదీప్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఇతర కమ్యూనిస్టు నాయకులు పాల్గొన్నారు.

పుట్లూరు : జిల్లా కమ్యూనిస్టు వ్యవస్థాపకుల్లో ఒకరైన వికె.ఆదినారాయణరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని చింతకుంటలో సిపిఐ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి డి.పెద్దయ్య మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా, కార్మికనేతగా, ప్రజాప్రతినిధిగా, రైతు బాంధవుడిగా, విద్యార్థి యువజన సంఘాల మార్గదర్శిగా వికె.ఆదినారాయణరెడ్డి సేవలు మరువలేనివన్నారు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు సి.పెద్దిరాజు, డిహెచ్‌పిఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎ.రమేష్, డి.పెద్దన్న, చేతివృత్తిదారుల సమైక్య మండల అధ్యక్షులు సి.ఓబుళపతి, దావీద్, ఆదెన్నయాదవ్, సూరి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : విప్లవవాది, కమ్యూనిస్టు యోధుడు, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ వీకే.ఆదినారాయణరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి రమేష్, నాయకులు మధుసూదన్ రావు, రాజు, షఫీ, పూలమాబు, డానియల్, నరసింహ, వెంకటేష్, వెంకట రాముడు, అశోక్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో వికె నారాయణరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

21న ఉచిత మెగా వైద్యశిబిరం

విలేకరులతో మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ వికే.శ్రీవాణి

గుత్తి : గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 21న ఉచిత మెగా కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు కళాశాల డైరెక్టర్ వికే. శ్రీవాణి తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సక్షమ్ అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఉదయం 9 గంటలకే శిబిరానికి వచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

23న పూలకుంటలో

గుమ్మఘట్ట : మండల పరిధిలోని పూలకుంట ప్రభుత్వ పాఠశాలలో సక్షమ్ సౌజన్యంతో గ్రామ వికాస సమితి ఆధ్వర్యంలో ఈనెల 23న ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు కెపి.దొడ్డి మంజునాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెట్రోల్ పోసి నిప్పంటించిన స్నేహితుడు.. బాలుడు మృతి

అమరాపురం : చిన్న విషయానికి స్నేహితుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన సోమవారం అమరాపురం మండలంలో చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని శివరం గ్రామానికి చెందిన దళిత రంగనాథ్(17), దళిత మహంతేష్ స్నేహితులు. మహం తేష్ గ్రామంలోని ఓ దుకాణం వద్ద సిగరెట్ కాలుస్తుండగా రంగనాథ్ మీ అమ్మ నాన్నలకు చెబుతాను అని హెచ్చరించాడు. దీంతో కోపోద్రిక్తుడైన మహంతేష్ ఆ దుకాణం ముందు విక్రయానికి ఉంచిన పెట్రోల్ తీసుకొని రంగనాథ్‌పై చల్లి నిప్పంటించడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మడకశిర సిఐ సుధాకర్‌బాబు తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం మడకశిర ఆసుపత్రికి తరలించినట్లు సిఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

తనకల్లు : స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన మద్దిగొల్ల చిన్ననరసింహులు (57) మంగళవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాంభూపాల్ యాదవ్ తెలిపారు. వివరాలు.. ఈయన ఆరేళ్ల క్రితం ఓ కేసులో ముద్దాయిగా ఉన్నాడు. ఆ కేసు ప్రస్తుతం అనంతపురం కోర్టులో విచారణ జరుగుతుండగా శిక్ష పడుతుందేమో అనే భయంతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అతడికి భార్య ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

కూలీ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని గీతానగర్‌కు చెందిన కూలీ పోతలయ్య మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గీతానగర్‌కు చెందిన పోతలయ్య కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మంగళవారం పోతలయ్య భార్య దుర్గ వాదులాడుకున్నారు. దీంతో మనస్థాపా నికి గురైన పోతలయ్య ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోతలయ్యను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దంపతులపై దాడి కేసులో నిందితుడు అరెస్టు

బత్తలపల్లి : మండల పరిధిలోని పోట్లమర్రి గ్రామంలో ఇంటి రస్తా విషయంలో దంపతులపై దాడి చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్ఐ విలేక రులతో మాట్లాడుతూ పోట్లమర్రి గ్రామంలో రెండు నెలలుగా రస్తా విషయంలో బొమ్మకం ఓబిలేసు, ఆది నారాయణరెడ్డి కుటుంబాల మధ్య ఘర్షణ జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఇంటికి రస్తా విషయంలో సర్వే చేస్తుండగా ఓబిలేసు అడ్డుకున్నారన్నారు. దీంతో ఆదినారాయణరెడ్డి కుమారుడు, కోడలు అడ్డు రాగా వారిపై ఓబిలేసు దాడి చేశాడన్నారు.

సిఎంగా జగన్ ఉన్నంత వరకూ సంక్షేమం ఆగదు

'జగనన్న సురక్ష'లో నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా జగన్ ఉన్నంత వరకూ సంక్షేమ పథకాలు ఆగవని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని భవానీనగర్, జనశక్తినగర్, శారదానగర్‌లో 'జగనన్న సురక్ష' కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతున్నామన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తూ నాడు-నేడు కింద వాటి రూపురేఖలు మార్చివేస్తున్నామన్నారు. నాలుగేళ్లలో రూ.3 లక్షల కోట్లు సంక్షేమానికి వెచ్చించామన్నారు. టిడిపి అధికారంలో ఉండగా సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం సిఎం జగన్ అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఎలా మంచి చేయాలని ఆలోచించకుండా కేవలం అధికారం కోసమే ప్రతిపక్షాలు పాకులాడుతున్నాయని విమర్శించారు. ఇకపోతే సేవా దృక్పథంతో పని చేస్తున్న వాలంటీర్ల పట్ల చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి, వైసిపి నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు లక్ష్మన్న, చింతకుంట మధు, వైసీపీ నేత జయరామ్‌నాయుడు, మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్లు ఎం.దేవి, వై.లక్ష్మీదేవి, సుమతి, గోగుల లక్ష్మీదేవి, హరిత, రామాంజనేయులు, రహంతుల్లా, సైఫుల్లా బేగ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సాకే కుళ్లాయిస్వామి, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జడ్పిటిసి రమాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం మండలం పరిధిలోని దేవుని ఉప్పలపాడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు పలరకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉండకూడదన్న లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఎవరైనా అర్హులై ఉండి పథకాలు అందకుంటే ఈ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటే అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రామకృష్ణ, యుఆర్‌డి కమలాబాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, ఎంపిటిసి రామ్మూర్తిరెడ్డి, గార్లదిన్నె సింగిల్‌విండో అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు .

శింగనమల : వైసిపి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గతంలో వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు మండల కేంద్రాల చుట్టూ తిరిగేవారని, అదే జగన్ ప్రభుత్వం వచ్చాక అధికారులే ఇళ్ల వద్దకు వచ్చి సుమారు 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, ఎంపిపి యోగేశ్వరి, ఎంపిడిఒ నిర్మలాకుమారి, తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎఒ అన్వేష్‌కుమార్, సర్పంచి నాగమణమ్మ, మైనార్టీ కోఆప్షన్ నెంబర్ బంగారు అలీబాషా, నాగవర్ధన్‌రెడ్డి, ఎన్‌వి నారాయణ, చెన్నకేశవులు, నర్మద్, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం : జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తున్నట్లు రుద్రంపేట సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణనాయక్, పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం రుద్రంపేట సచివాలయం-2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది. గ్రామ వాలంటరీలు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురంలో నిర్వహించిన 'జగనన్న సురక్ష'లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

పెద్దపప్పూరు, శింగనమలలో ధ్రువపత్రాలను అందజేస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకూ'

'గడప గడపకూ'లో నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

సంక్షేమం, అభివృద్ధి, పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలబడమే కాకుండా సిఎం జగన్ పాలన పట్ల ప్రజల్లో నమ్మకం రెట్టింపు అయిందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం విడపనకల్లు మండలంలోని కొట్టాలపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజలకు సిఎం జగన్ చేస్తున్నంతగా గతంలో ఏ సీఎం చేయలేదన్నారు. అభివృద్ధి,సంక్షేమ పథకాలే తమ ప్రభుత్వానికి శ్రీరామరక్ష అన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మోదుపల్లి రామాంజనేయులు, ఎంపిపిలు కరణం పుష్పావతి, చంద్రమ్మ, వైస్‌ఎంపిపి మోదుపల్లి సునీత, జడ్పిటిసి హనుమంతు, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు సుంకన్న, నాయకులు కరణం భీమిరెడ్డి, భీమ్‌రావు, గోపాలకృష్ణ, కొట్టాలపల్లి గ్రామ నాయకులు ధనుంజయ, లక్ష్మీనారాయణ, మురళీమోహన్, మోదుపల్లి బాబు, మోదుపల్లి రామసుబ్బయ్య, కమలాకర్, మల్లికార్జున, రంగనాయకులు, చంద్రమౌళి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : సమస్యల పరిష్కారం కోసమే ఇంటింటికీ వెళ్తున్నామని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కొజ్జేపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతీరెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల అభివద్ధి కోసమే సీఎం జగన్ మోహన్ రెడ్డి నవరత్న పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ఆభివృద్ధికి జగనన్న పాటుపడుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గాండ్లపాటి విశాలాక్షి, మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్ సి.సునీలాయాదవ్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ సి.మల్లయ్య యాదవ్, వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ జి.గోవర్ధన్‌రెడ్డి, నాయకులు కె.మధుసూదన్‌రెడ్డి, వై.సుభాష్‌రెడ్డి, బి.రమేష్‌రెడ్డి, గురుప్రసాద్, ఎ.సూర్యనారాయణరెడ్డి, ఎన్‌సి.రంగయ్య, మహాలింగ, సి.రాముయాదవ్, వేల్పుల సోమశేఖర్‌యాదవ్, కౌన్సిలర్లు వరద, ఫారూక్, వాల్మీకి శివ, సర్పంచులు ఎ.వెంకటేష్, వాసుదేవరెడ్డి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

గుత్తిలో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి